ప్రజాశక్తి
బుధవారం 15 ఫిబ్రవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

అన్నీ సమస్యలే..!

- చర్చించేవెన్ని.. పరిష్కరించేవి ఎన్ని?
- నేడు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్‌సి) సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి, రాష్ట్ర రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మన ప్రసాదరావు అధ్యక్షత నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, సభ్యులు హాజరుకానుండగా సమావేశంలో చర్చించేందుకు పలు అంశాలతో ఎజెండాను రూపొందించారు. వ్యవసాయం, ఉద్యాన, విద్య, వైద్యం, నవరత్నాలు, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, జగనన్న సంపూర్ణ భూ హక్కు.భూ రక్ష సర్వే, సంక్షేమ పథకాలు, గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర అంశాలపై చర్చిస్తారని అధికారులు తెలిపారు.

ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో సొమ్ములు రాలేదు. తడిసిన రంగు మారిన ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు తప్పలేదు. అయితే ఈ ఏడాది మార్కెట్‌లో సన్నబియ్యానికి డిమాండ్ రావడంతో తెలంగాణ వ్యాపారులు జిల్లాకు వచ్చి కొనుగోలు చేయడం వల్ల కొంత మంది రైతులకు కనీస మద్దతు ధరలు లభించాయి. కొంత మంది రైతులు ఇప్పటికీ పొలాల్లో కుప్పలు వేసుకున్నారు. రబీ సీజన్‌లో దాదాపు 40 వేల ఎకరాల్లో ఏ పంటలు వేయలేదు. జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగు చేస్తారని అంచనా వేయగా 1.40 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అపరాలు కూడా పూర్తి స్థాయిలో సాగు చేయలేకపోయారు. రబీలో ఎరవులు కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఖరీఫ్‌లో మాదిరిగానే రబీలో కూడా 40 వేల ఎకరాల్లో సాగు చేయకుండా భూములు ఖాళీగా ఉంచడాన్ని అధికార యంత్రాంగం సీరియస్‌గా తీసుకోవాల్సి ఉంది. ఉద్యాన పంటల పరిస్థితి ఆశాజనకంగా లేదు. జిల్లాలో 85 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు జరుగుతుందని అంచనా వేయగా 65 వేల ఎకరాల్లోనే మిర్చి, పసుపు, పండ్లు, కూరగాయలు, పూలు,ఇతర ఉద్యాన పంటను సాగు చేశారు. మిర్చిలో ఈ ఏడాది కూడా తెగుళ్లు వెంటాడాయి. దీంతో రైతులు ఇబ్బడి ముబ్బడిగా పురుగుమందులను వినియోగించారు. ఇందువల్ల మిర్చి రైతులకు అదనపు భారం, వినియోగదారుల ఆరోగ్యానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తెగుళ్ల నివారణకు శాశ్వత పరిష్కారం, పైరు ప్రాథమిక దశలోనే రైతులలో చైతన్యం కల్గించాల్సిన అవసరాన్ని గుర్తించడంలేదు. మూడేళ్ల నిలిచిన తుంపర సేద్యానికి ఈ ఏడాది మళ్లీ అవకాశం కల్పించారు.

విద్యా శాఖకు సంబంధించి నాడు-నేడులో 563 పాఠశాలలు మంజూరు చేశారు. జిల్లా మొత్తం మీద 838 పనుల కోసం రూ.215.08 కోట్లు కేటాయించారు. ఈ పనులు వివిధ స్థాయిలో ఉన్నాయి. వైద్యశాఖ పరంగా జిల్లాలో డెంగ్యూకేసులు పెద్ద సంఖ్యలోనే నమోదు అవుతున్నాయి. గతేడాది మొత్తం 168 కేసులు నమోదు కాగా ఈ ఏడాది జనవరిలోనే 13 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో గుంటూరు నగరంలో 11, పెదకాకాని, తెనాలిలో ఒక్కో కేసు చొప్పున నమోదయ్యాయి. పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా మత్తం 67,678 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 6233 మాత్రమే పూర్తయ్యాయి. 29,337 ఇళ్లు వివిధ దశల్లో ▶ 2లో



బాధితులతో కలిసి మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్, గంజిమాల రవిబాబు

ఇక్కుర్రులో ఘటన దారుణం

- నిందితులపై ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు పెట్టాలి
- సిపిఎం, కెవిపిఎస్ డిమాండ్ - నాయకులను కలిసిన బాధితులు

ప్రజాశక్తి - నరసరావుపేట

మండలంలోని ఇక్కుర్రులో గత శనివారం రాత్రి ఎస్టీ మహిళ ఇంటిపైకి వెళ్లి ఆమెను దూషించడంతోపాటు ఇల్లు కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుతోపాటు అరెస్టు చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. ఈ అంశంపై నరసరావుపేట రూరల్ పోలీసులకు బాధితురాలు రాసగిరి దీనమ్మ తన కుటుంబీకులతో కలిసి ▶ 2లో

పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తాం

- కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- అమరావతిలో ధాన్యబుద్ధ పర్యాటక వనానికి ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 24న ధర్నాలు

జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, దీనికి నిరసనగా 24న అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో ధర్నాలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. తాడేపల్లికి మంగళవారం వచ్చిన ఆయన ఆ పార్టీ కార్యాలయంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, ఇతర నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలను విస్మరించారని, రైల్వే జోన్, కడప ఉక్కుర ఫ్యాక్టరీ ఊసేలేదని మండిపడ్డారు. ఉపాధి హామీ కింద ఏడాదికి 200 రోజుల పని దినాలు, రోజుకు రూ.600 కూలివ్వాలనే డిమాండ్ ఉన్నా వాటిని విస్మరించడంతోపాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి రూ.30 వేల కోట్లు తగ్గించారని మండిపడ్డారు. ఎరువులపై సబ్సిడీని తగ్గించారని, ధాన్యం సేకరణలో కీలకంగా ఉన్న ఎఫ్‌సిఐకి నిధులు తగ్గించారని తెలిపారు. ఇప్పటివరకు సగం మంది రైతుల వద్దయినా పంటను కొనలేదన్నారు. దేశ జనాభాలో ఎస్‌టిలు 8 శాతం ఉంటే నిధులు 2.5 శాతం కేటాయించారని, కేంద్రీయ విద్యాసంస్థలకు నిధులు తగ్గించేశారని విమర్శించారు. ఇంత ▶ 2లో



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

దేశ సమస్యలను పరిష్కరించని కేంద్ర బడ్జెట్

బడ్జెట్‌పై విశ్లేషణ సదస్సులో వక్తలు

5 లో



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రదర్శన చేస్తున్న విఆర్ఏలు

8 లో

విఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలో నాయకుల డిమాండ్ - నరసరావుపేటలో భారీ ర్యాలీ - జెసిలకు వినతి



8 లో

సైన్స్‌ఫేర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

జీవన సమస్యలు.. పిల్లల పరిష్కారాలు..

జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం - ఆకట్టుకుంటున్న నమూనాలు

పిల్లలతో ఆలాంటి పనులు చేయించొద్దు

కెసిబివిని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి

2 లో

23న ఫ్యాక్టరీలలో మాక్‌డ్రిల్

జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రావు

పిల్లలతో ఆలాంటి పనులు చేయించొద్దు

కెసిబివిని సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను గురజాల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శేషాద్రి మంగళవారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ పిల్లలతో బాత్‌రూంలు కడిగిస్తున్నారని తల్లిదండ్రులు ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసిన అంశంపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులతో ఇలాంటి పనుల చేయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు సమస్యలేమీ లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ రామాంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

అన్నీ సమస్యలే..!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. మొత్తంగా 45 శాతం మంది లబ్ధిదారులే ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు.నిర్మాణ వ్యయం సరిపోక దాదాపు సగానికిపైగా లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. ఈ అంశంపై ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయి. 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు అందిస్తామన్న హామీ కూడా పూర్తిస్థాయిలో నెరవేర లేదు. మొత్తం 28,217 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 14,168 మందిని అర్హులుగా తేల్చారు. వీరిలో 10,786 మందికి జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించారు. మిగతా వారి పరిస్థితిపై స్పష్టత రాలేదు. ఈ అన్ని అంశాలూ సమావేశంలో చర్చకు రానున్నాయి.

ఇక్కుర్రులో ఘటన దారుణం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం, కెవిపిఎస్ నాయకులను కలిశారు. అండగా ఉంటామని ఆమెకు భరోసానిచ్చిన విజయ్‌కుమార్, రవిబాబు మాట్లాడుతూ మహిళను నిర్బంధించి ఇంటిని నేలమట్టం చేశారని, దాడి చేసి, చంపుతామని బెదిరించారని అన్నారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు కూతవేటు దూరంలోని గ్రామంలో ఒక గిరిజన కుటుంబానికి ఇంత అన్యాయం జరిగినా పోలీసులకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి ఇప్పటికైనా రక్షణ కల్పించాలన్నారు. ఈ అంశంలో న్యాయం చేయకుంటే దళిత, గిరిజన, ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితురాలి భర్త సంగీతరావు, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. ఇంటి స్థల వివాదం కోర్టులో నడుస్తోందని బాధితరాలు దీనమ్మ పేర్కొన్నారు. అయినా గత శనివారం కన్నెబోయిన ఏడుకొండలు అతని కుటుంబీకులు వచ్చి తనను బలవంతంగా ఇంట్లో నుండి బయటకు లాగారని, సామాన్లను రోడ్డుమీదికి విసిరేశారని చెప్పారు. ఎంత బతిమాలినా వినకుండా ఇంటిని పొక్లెయినర్‌తో కూల్చేయించారని, బీరువాను పగలగొట్టి అందులో ఉన్న తన కుమారుడు వాసుకు చెందిన డిగ్రీ ధ్రుపత్రాలను, కొద్దిపాటి బంగారం, వెండి ఆభరణాలను తీసుకెళ్లారని వివరించారు. వైసిపి నాయకుల అండతోనే ఇదంతా చేశారని, ఊరును విడిచి వెళ్లకుంటే చంపుతామని బెదిరించారని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 24న ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

అన్యాయం జరిగినా రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు బడ్జెట్‌ను సమర్థించడం క్షమించరానిదన్నారు. దేశానికి ప్రమాదకరంగా ఉన్న అదానీ కుంభకోణంపై ప్రధాని పెదవి విప్పకపోవడం శోచనీయమని, బ్యాంకులు, ఎల్‌ఐసిలో ప్రజలు దాచుకున్న వేల కోట్లను అదానీ పరం చేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. మరోవైపు ప్రజల ఉద్యమాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 1ను తెచ్చిందని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తాం

- **కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి**
- **అమరావతిలో ధ్యానబుద్ధ పర్యాటక వనానికి ప్రారంభోత్సవం**



ప్రారంభిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి , ఆరెక్ రోజా

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తామని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలోని అమరావతి మండల కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ధ్యానబుద్ధ విగ్రహానికి ఎదురుగా స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.15.02 కోట్లతో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధ వనం, పర్యాటక వసతిగృహం, ధ్యాన కేంద్రం, ఇన్ఫర్మేషన్ సెంటర్లను రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కె రోజా, కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ విదేశాల్లోని 250 రకాల భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ఇనుమడింపజేసే చారిత్రక సంపదను దేశానికి తెచ్చామని, వీటిని పలు మ్యూజియంలో సందర్శకులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. రాష్ట్రంలోనూ పలు పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు, పుణ్యక్షేత్రాలను, పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పర్యాటక రంగంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు మాట్లాడుతూ అమరావతి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు మరింతగా సహకరించాలని మంత్రులు కిషన్‌రెడ్డి, రోజాను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఎమ్‌డి కె.కన్నబాబు, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీమోహన్, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఎ.వరప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

23న ఫ్యాక్టరీలలో మాక్‌డ్రిల్

జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రావు

ప్రజాశక్తి-గుంటూరు

అత్యంత ప్రమాదకర ఫ్యాక్టరీల్లో విపత్కర పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఈనెల 23న మాక్‌డ్రిల్ ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఒ) కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో స్పెషల్ డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డిఆర్‌ఒ మాట్లాడుతూ ఈ మాక్‌డ్రిల్ రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుందని, జిల్లా పరిధిలోని ఫ్యాక్టరీలలోనూ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అత్యంత ప్రమాదక ఫ్యాక్టరీల్లో రక్షణ చర్యలను అభివృద్ధి చేయటానికి, రక్షణ కమిటీల ద్వారా కార్మికులకు రక్షణ చర్యలపై నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. ఫ్యాక్టరీలలో ప్రమాదకర వాయువులు లీక్ అయితే పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేలా అలారమ్ సిస్టం, సైరన్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర రసాయనాలు, మండే స్వభావం ఉన్న గ్యాస్, ఆయిల్స్ రవాణా చేసే వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రజలను హెచ్చరించేందుకు అవసరమైన సైరన్లను కచ్చితంగా ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదకర వాయువులు లీక్ అయినప్పుడు తీసుకోవలసిన రక్షణ చర్యలపై కార్మికులతోపాటు ప్రజలకు ఎన్‌డిఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించేలా మాక్‌డ్రిల్ నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ శివకుమార్‌రెడ్డి, ఎన్డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అస్లాం, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటేశ్వరరావు, డీఎస్పీ బి.చంద్రశేఖరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విప్రో అవార్డుకు అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశకి- మంగళగిరి



అవార్డుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గ్లోబల్ హెడ్ ఆఫ్ సస్టైనబిలిటీ అఫ్ విప్రో జాతీయ స్థాయి అవార్డుకు అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో అరవింద విద్యా సంస్థల డైరెక్టర్ బి. ఇంద్రాణి, ప్రిన్సిపాల్ సాయి అరవింద్‌లు విద్యార్థులను అభినందించారు.దేశంలో స్థాపించబడి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిన 'విప్రో' సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు మన జీవనానికి అవసరమైన నీరు, వ్యర్థ పదార్థాల వినియాగం, జీవన వైవిధ్యం అనే అంశాలపై పరిశోధన చేసి ప్రాజెక్టు తయారు చేయాలని సూచించింది. అందకు అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులు తమ పరిశోధనను నిర్వహించారు. ఈ పరిశోధనలో పదవ తరగతి విద్యార్థినులు సాత్విక చౌదరి, మేరీ ప్రశాంతి మరియు 9 వ తరగతి విద్యార్థినులు వి. హేమ, గీతా వెన్నెల, పి.యుక్తికలు అకడమిక్ ఇంచార్జి వరలక్ష్మి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు నాయక్ పర్యవేక్షణలో సలహాలు, సూచనలతో పరిశోధనను పూర్తి చేశారని తెలిపారు. ఈ పరిశోధనల్లో దక్షిణ భారతదేశ పరంగా 5 ప్రాజెక్టులను నేషనల్ విన్నర్స్‌గా విప్రో ఫౌండేషన్, బెంగళూరు వారు ప్రకటించారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుండి అరవింద మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రాజెక్ట్ ఎంపికైంది. ఆ అవార్డును తీసుకొనటకు విప్రో సంస్థ బెంగుళూరు వారు వారికి ప్రయాణానికి విమాన సౌకర్యాన్ని కల్పించారు. విప్రో సిఈఓ రిషీద్ ప్రేమ్ జి, అజీమ్ ప్రేమ్ జి యూనివర్సిటీ సిఈఓ అనురాగ్ బెహార్ మరియు పిఎస్. నారాయణన్, గ్లోబల్ హెడ్ ఆఫ్ సస్టైనబిలిటీ అఫ్ విప్రో వారు పరిశోధనలో పాల్గొన్న విద్యార్థినులను, ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులను అందిస్తారిని తెలిపారు.



నివాళులర్పిస్తున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

కార్పోరేటర్ కృష్ణారెడ్డి మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ 48వ డివిజన్ కార్పోరేటర్ తనుబుద్దు కృష్ణారెడ్డి(55) మంగళవారం మృతి చెందారు. బ్రెయిన్ స్ట్రోక్ తో బాధపడుతూ ఆకస్మికంగా మృతి చెందడంపై పలువురు వైసిపి నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. 2021లో జరిగిన వైసిపి ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన భౌతిక కాయాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. కృష్ణారెడ్డి మృతికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వర ప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, మద్దాలి గిరిధర్, ముస్తాఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్లు డైమండ్ బాబు, సజీలా తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.



మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

ప్రచారం కోసమే ఇంటింటికి వైసిపి స్టిక్కర్లు

ప్రజాశక్తి -తెనాలి

ప్రచారం కోసమే ఇంటింటికి వైసిపి స్టిక్కర్లు అంటిస్తున్నారని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ త్వరలో అధికార పార్టీ చేపట్టనున్న 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఇంటింటికి తిరిగి వైసిపి స్టిక్కర్లు వేయడం, అలాగే వారి ఫోన్లు పై కూడా స్టిక్కర్లు అంటించటమేమిటని ప్రశ్నించారు. పార్టీలో ఎమ్మెల్యేలు, మంత్రులపైనే జగన్‌కి నమ్మకం లేదని వారికి ముందు పచ్చబొట్లు పొడిపించుకోవాలన్నారు. ఆ పచ్చబొట్లు చూపిస్తూ ప్రచారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టి వెంకటరమణరావు, ఏ హరికృష్ణ, బి రవికాంత్, పి మురళీకష్ణ, కాలేషా, జాకీర్, వి మురళి తదితరులు పాల్గొన్నారు

భూములివ్వకుండా మోసం : బిఎస్ రావు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: చైతన్య గ్రూప్ విద్యా సంస్థల చైర్మన్ సంచలన ఆరోపణలు చేశారు. పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ తమను మోసం చేశారని తెలిపారు. మంగళవారం పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని ఓ హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలను విస్తరించేందుకు భూములు, భవనాలు ఇప్పిస్తామని చెప్పి తమతో డిపాజిట్లు రమేష్ సేకరించారన్నారు. 2013లో వివిధ చెక్కుల రూపంలో 310 కోట్ల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. తీసుకున్న డబ్బుకు హామి చేస్తామని చెప్పి ఇప్పటి వరకు భూములు ఇవ్వకుండా మోసం చేశారన్నారు.

ఆరోపణలు అవాస్తవం : లింగమనేని రమేష్

చైతన్య విద్యా సంస్థల అధినేత బిఎస్‌రావు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమని లింగమనేని రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్ రావుకు తమకు ఆర్థిక, వ్యాపార వివాదాలు ఉన్న మాట వాస్తవమేనని, కేవలం 137 కోట్ల రూపాయల వివాదం మాత్రమే ఉందని పేర్కొన్నారు. వివాదం న్యాయ పరిది లో ఉన్నందున దానిపై మాట్లాడటం సబబు కాదన్నారు.

ఎస్తేరు రాణికి జొన్నపాడులో అంత్యక్రియలు

ప్రజాశక్తి - గుడివాడ (కృష్ణాజిల్లా)

తాడేపల్లి సీఎం నివాసం సమీపంలో హత్యకు గురైన దళిత, అంథబాలిక ఎస్తేరు రాణి అంత్యక్రియలు స్వగ్రామం నందివాడ మండలం జొన్నపాడులో అంత్యక్రియలు జరిగాయి. ముందుగా జొన్నపాడులో బాలిక భౌతిక కాయానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు, టీడీపీ నేతలు బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పోలాసి ఉమా, రమేష్ చౌదరి, దేవేంద్రుడు, అసిలేటి నిర్మల తదితరులు పాల్గొన్నారు. సిఎం ఇంటి కూత వేటు దూరంగా ఇలాంటి దుర్ఘటన జరగటం బాధాకరమని టిడిపి విభిన్న ప్రతిభ వంతల రాష్ట్ర అధికార ప్రతినిధి మజ్జాడ నాగరాజు ఖండించారు. టిడిపి విభిన్న ప్రతిభావంతుల విభాగ మచిలీపట్నం పార్లమెంట్ అధికార ప్రతినిధి కొడాలి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు నిమ్మగడ్డ కృష్ణారావు, బొర్రా శ్రీనివాసరావు, దేవేంద్రుడు, గోపాలకృష్ణ పాల్గొన్నారు. .

ఎస్తేరు రాణి కుటుంబానికి అండగా ఉంటాం : అనిత

తాడేపల్లిలో హత్యకు గురైన దళిత బాలిక స్వగ్రామమైన నందివాడ మండలం జొన్నపాడులో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ సాక్షాత్తు సీఎం ఇంటికి కూతవేటు దూరంలోనే దళిత బాలికను హత్య చేయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం టీడీపీ తరపున రెండు లక్షల రూపాయల చెక్కును బాధిత కుటుంభ సభ్యులకు అందజేశారు.


ఏస్తేరురాణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తు అనిత, రావి వెంకటేశ్వరరావు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి :కెవిపిఎస్

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

తాడేపల్లి పట్టణం, ఎన్‌టిఆర్ కట్ట ప్రాంతంలో ఆదివారం మైనర్ బాలిక ఎస్తేరు రాణిని అతి కిరాతకంగా హత్య చేసిన నిందితుడు నాగ పోగు దయానంద రాజు, అలియాస్ కుక్కల రాజును కఠినంగా శిక్షించాలని, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం గుంటూరు జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్ బాబు, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్రాంతంలో రోజురోజుకీ మందుబాబుల ఆగడాలు మితి మీరుతున్నాయని ఆయన అన్నారు. మైనరు బాలిక, ఓ అందురాలిపై ఇలాంటి హత్య జరగటం దురదృష్టకరమన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నివాసం ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగటం వలన, మహిళలు భయబ్రాంతులకు గురవుతున్నారని, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా, తాడేపల్లి పరిసర ప్రాంతాలలో విచ్చలవిడిగా అమ్మే, మద్యం అమ్మకాలను నియంత్రించాలని అన్నారు. అంతేకాకుండా బాలికలపైన, మహిళల పైన జరిగే అఘాయిత్యాలను, దాడులను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్తేరు రాణిని కోల్పోయిన కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ గుంటూరు జిల్లా నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్, స్వామినాథన్, కంప వెంకటయ్య, దర్శనపు విజయ్ బాబు, జెట్టి రాంబాబు, దాసరి అజయ్ తదితరులు ఉన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

తాడేపల్లిలో ఎస్తేరు రాణి హత్యకు నిరసనగా జనసేన నాయకులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్తేరు రాణిని దారుణంగా చంపారన్నారు. గన్ కంటే జగన్ ముందు వస్తారని ప్రచారం చేసుకున్నా వారికి సిఎం నివాసం చుట్టూ వందలాది గన్‌లు ఉన్నా ఒక్క గన్ కూడా రాలేదేని విమర్శించారు. గంజాయి ముఠాల ఆగడాలు ఇక్కడ బాగా పెరిగి పోతున్నాయన్నారు. ఇటువంటి వారిని కఠినంగా శిక్షించి ఎస్తేరు రాణి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి కోరారు.


సంజీవయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి -తెనాలి

ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని పలువురు దళిత సంఘాల నాయకులు కొనియాడారు. స్థానిక మల్లెపాడులో మంగళవారం సంజీవయ్య 102వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అధికారికంగా ప్రతి ఏటా సంజీవయ్య జయంతి, వర్ధంతి నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంజీవయ్య చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించారు. మాజీ సర్పంచ్ పి. సురేష్ బాబు, దళిత లిబరేషన్ ఆర్గనైజేషన్ నాయకులు గుంటి సురేష్ బాబు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కంచర్ల చంద్రశేఖర్, అంబేద్కర్ సంఘ నాయకులు ఆరే రఫాయేలు, రెడ్స్ డైరెక్టర్ తురిమెళ్ళ మోహనరావు, బడుగు రత్నకుమార్, గుమ్మడి ప్రకాష్ రావు పాల్గొన్నారు

ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో

మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమాన్ని నగరంలోని ఆటోనగర్‌లో గల ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. దామోదరం సంజీవయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, నాయకులు ఎండి ఫిరోజ్ తదితరులు,. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

తమ్ముడిపై అక్క రాయితో దాడికి పాల్పడిన ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని ఐతానగర్‌కు చెందిన ఆదిత్య సోమవారం రాత్రి మద్యం సేవించి, తన అక్క ఆషాతో గొడవ పడ్డాడు. ఇద్దరిమధ్య జరిగిన వాదోపవాదాలు తీవ్ర స్థాయికి చేరటంతో ఆషా రాయితో ఆదిత్యను కొట్టింది. గాయ పడిన ఆదిత్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



'ఆ.. అమ్మాయి' షార్ట్ ఫిలిం ప్రారంభం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

తజ్ముల్ బేగ్ తనయుడైన తాజ్ మహమూద్ బేగ్ నిర్మించిన" ఆ అమ్మాయి "షార్ట్ ఫిలింను రవి ఘీ స్వీట్స్ అధినేత సయ్యద్ బాజీ మంగళవారం స్థానిక ఐలాండ్ సెంటర్లో ప్రారంభించారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో సేవలందించిన తజ్ముల్ బేగ్ తనయుడు తాజ్ మహమూద్ బేగ్ షార్ట్ ఫిలిం నిర్మించటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో షేక్ బాజీ సాహెబ్ , షేక్. నాజర్, షేక్ సఫాయతుల్లా, గేరా సుబ్బయ్య, షేక్ మునీర్, ఫిరోజ్, ఇక్బాల్ బేగ్, సుభాని, జానీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పట్టణంలోని 3 వార్డుకు చెందిన నూర్ భాషా సైదులు కుమారుడు బాజీ సైదా (15) కనిపించడం లేదని తండ్రి సైదులు సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సైదులుకు ఇద్దరు కుమారులని మొదటి కుమారుడు ఖాన్ సైదా కాగా, రెండో కుమారుడు బాజీ సైదాలు సుగాలి కాలనీ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్నాడు. సైదులు భార్యకు ఆరోగ్యం సరిగా లేక పిల్లుట్ల దర్గా వద్దకు 13వ తేదీన వెళ్ళగా తన రెండవ కుమారుడిని అమ్మమ్మ ఇంటి వద్ద సత్తెనపల్లిలో వదిలి వెళ్లారు. అయితే బాజీ సైదా స్కూలుకు రావడంలేదని స్కూల్ మాస్టారు సైదాకు ఫోన్ చేసి తెలిపారు. సైదా బాజీ సైదాకు ఫోన్ చేసి స్కూల్‌కి వెళ్లడం లేదని ఎందుకు వెళ్లడం లేదని అడిగాడు. దీంతో కుమారుడు బాజీ తనకు చదువుకోవడం ఇష్టం లేదని నేను స్కూల్‌కి వెళ్ళను అని చెప్పాడు. తండ్రి సైదా కుమారుడిని మందలించాడు. అదే రోజు సాయంత్రం సైదా సత్తెనపల్లి తిరిగి వచ్చేసరికి కుమారుడు బాజీ సైదా కనిపించడం లేదు .ఇరుగుపొరుగు వారిని ,బంధువులను అడిగినా ప్రయోజనం లేకపోవడంతో 13వ తేదీ సాయంత్రం నుండి కనిపించడం లేదని 14వ తేదీ మంగళవారం సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ శోభన్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడు అదృశ్యం

ప్రజాశక్తి-తెనాలి : కార్మికుడు అదృశ్యంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం బాలాజిరావుపేటకు చెందిన పసుపులేటి సుధాకర్ కూలికి వెళ్ళి జీవనం సాగిస్తుంటాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్ళిన సుధాకర్ తిరిగి రాలేదు. సుధాకర్ భార్య నాగేశ్వరి పోలీసులను ఆశ్రయించటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .


సమావేశంలో మాట్లాడుతున్న కత్తెర సురేష్

ప్రభుత్వ పథకాలను సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు: ప్రభుత్వ పథకాలను నిర్ణీత గడువులోగా లబ్ధిదారులకు అందించాలని, నిర్లక్ష్యంగా ఎవరూ వ్యవహరించవద్దని సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి అన్నారు. మండల కేంద్రం తుళ్లూరులోని హెచ్ ఎస్ఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు,వాలంటీర్ల సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,ప్రజా రంజక పాలన చూసి ప్రతిపక్షాలు,ఎల్లో మీడియా అసత్యాన్ని ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి చేస్తున్న మంచి పనులను ప్రజల వద్దకు చేర్చాల్సిన బాధ్యత తమఉందని అన్నారు.కుల,మత, ప్రాంత,పార్టీలకు అతీతంగా ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు ప్రభుత్వ పథకాలను, పాలన గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	1,40,104
మిర్చి ఎగుమతి	1,37,168
మిర్చి నిల్వ	94,377

మిర్చి ధరలు

రూపాయలలో

334	7000 - 20500
నెం.5	13000 - 20000
273	8000 - 20000
341	7500- 22000
4884	11000 - 19000
సూపర్-10	9300- 18000
నాన్ ఎసి	
తేజ	7000 - 20500
బడిగె	8000 - 25000
దేవనూరు డీలక్స్	7500 - 23000
తాలుకాయలు	4000 - 12500

తిరునాళ్ల విజయవంతానికి సమన్వయంతో పని

వివిధ శాఖల అధికారులతో జెసి, ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 18న కోటప్పకొండ తిరునాళ్ల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సూచించారు. ఉత్సవాలపై ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కోటప్పకొండలోని కళ్యాణ మండపంలో మంగళవారం జెసి సమీక్షించారు. సందర్శకులకు ఇబ్బందులేమీ లేకుండా ఏర్పాట్లు చేయాలని, క్లోరినేషన్, పారిశుధ్యం పక్కాగా ఉండాలని చెప్పారు. మహిళలకు మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. సందర్శకులకు ఎక్కడికక్కడే తాగునీటి ఏర్పాట్లు ఉండాలని, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలను కొండ పైన కింద ఏర్పాటు చేయాలని చెప్పారు. నీళ్ల ట్యాంకులను అందరికీ కనిపించే విధంగా ఉన్న ప్రదేశాలలో ఉంచాలన్నారు. ప్రభలు వచ్చే దారిలో ఇబ్బందులు కలగకుండా సులభంగా వచ్చే విధంగా రోడ్లను ఉంచాలని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండమీద కొండ క్రింద నిర్వహిస్తున్న కమాండ్ కంట్రోల్ రూముల్లో సిబ్బంది షిఫ్టుల వారీగా 24 గంటలు పని చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సందర్శకులు వచ్చిపోయే మార్గాల్లో, వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తనివ్వొద్దని చెప్పారు. సమీక్షలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎఎస్‌పి బిందుమాధవ్, డిఆర్‌ఒ వినాయకం, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కోటప్పకొండ ఈవో వి.గోపి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న జెసి శ్యాం ప్రసాద్, వేదికపై ఎమ్మెల్యే, ఎస్పీ తదితరులు

రబీలో 71105 ఎకరాలు ఈ-క్రాప్ పూర్తి

- డ్రోన్ల ద్వారా మందుల పిచికారీపై రైతులకు ఉచిత శిక్షణ
- పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి
- పాకాలపాడు, బొల్లవరంలో పొలాల పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



పాకాలపాడులో ఈ-క్రాప్ నమోదుపై పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పల్నాడు జిల్లాలో రబీ సీజన్లో రైతులు 92918 ఎకరాల్లో పంటలు సాగు చేయగా 71105 ఎకరాలకు ఈ-క్రాప్ పూర్తి చేసామని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడులో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారితో పాటు వ్యవసాయ కమిషనరేట్ నుండి ఈ-క్రాప్ పరిశీలకులు రత్న మంజుల పర్యటించిన ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వల్ల పంటనష్టం వాటిల్లితే పరిహారం పొందేందుకు వైయస్సార్ ఉచిత పంటల బీమా కోసం తప్పని సరిగా రబీ పంటలకు ఈ-క్రాప్ చేయించుకోవాలని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుండి వ్యవసాయలో డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. 28 మండలాల్లో మండలానికి మూడు చొప్పున 84 కస్టమ్ హైరింగ్ సెంటర్లకు డ్రోన్లు రాయితీపై అందిస్తామని చెప్పారు. ఇందుకుగాను పల్నాడు జిల్లాలో 57 కేంద్రాలను గుర్తించామన్నారు. డ్రోన్‌లతో పురుగు మందు పిచికారీపై రైతులకు ఉచితంగానే శిక్షణిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్. రవికుమార్, ఎఒ అరుణచంద్ర, సత్తెనపల్లి ఇన్‌ఛార్జి ఎడిఎ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి ముప్పాళ్ల

మండలంలోని బొల్లవరంలో ఈ-క్రాప్ నమోదును రత్నమంజులతోపాటు జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సి.హెచ్.రవికుమార్, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ సాంకేతిక వ్యవసాయాధికారిణి పి.అరుణ చంద్ర పరిశీలించారు. సిబ్బంది, రైతులతో మాట్లాడి పలు వివరాలు నమోదు చేసుకున్నారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, విఆర్వో సంజీవరావు, అగ్రి అసిస్టెంట్ శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్ రాంబాబు, రైతులు బి.వెంకటరెడ్డి, నాగశ్రీనివాసరెడ్డి, శ్యామల, షేక్ బుడే, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



వందనాదేవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బి.వందనాదేవికి సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో వేడుకలను మంగళవారం నిర్వహించారు. వందనాదేవితో కేక్‌ను కట్ చేయించారు. అనంతరం ఆమెను వైవీ ఆంజనేయులు సత్కరించారు. వందనాదేవికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.సాంబయ్య, బి.చంద్రశేఖర్, కె.రామకృష్ణ, ఎ.అమరేశ్వరరావు పాల్గొన్నారు.

విధులు చేపట్టిన నూతన తహశీల్దార్

ప్రజాశక్తి-ఈపూరు



ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానని నూతన తహసిల్దార్‌గా నియమితులైన రమావత్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



66 మంది న్యూటన్ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మాచర్ల మండలం అలుగురాజుపల్లి సమీపంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ మహీంద్రా కంపెనీ మంగళవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో న్యూటన్స్ విద్యార్థులు 66 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జూన్నా శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి, డీన్ సందీప్‌రెడ్డి, టిపిఒ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

పోలీస్ శాఖకు హీరో మోటార్స్ ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం పోలీసు సిబ్బందికి అవసరమైన ద్విచక్ర వాహనాలను అందించినందుకు హీరో మోటార్ కార్పొరేషన్ ప్రై.లిమిటెడ్, తిరుపతి వారికి పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్) కింద పల్నాడు జిల్లాకు 20 ద్విచక్ర వాహనాలను హీరో మోటార్స్ అందించగా వీటిని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మంగళవారం ప్రారంభించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, జిల్లా పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్ఐ రమణరెడ్డి పాల్గొన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఎఎస్పీ బిందుమాధవ్ తదితరులు



18న ఏలేశ్వరస్వామి గుట్టకు లాంచి సర్వీసులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మహాశివరాత్రి నేపథ్యంలో ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన అనుపు నుంచి ఏలేశ్వరస్వామి గుట్ట (మల్లయ్య గట్టు)కు ప్రత్యేక లాంచీ సర్వీసులను తిప్పనున్నట్లు లాంచీ స్టేషన్ మేనేజర్ భైరవ స్వామి మంగళవారం తెలిపారు. కరోనా కారణంగా మూడేళ్లుగా ఏలేశ్వరస్వామి గుట్టకు లాంచీలు నిలిచాయని, వాటిని పునరుద్ధరించామని చెప్పారు. 18న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లాంచీ సర్వీసులు అనుపు నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. అనుపు నుంచి ఏలేశ్వర గట్టుకు వెళ్లేందుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 టిక్కెట్ ధరను నిర్ణయించినట్లు వివరించారు. మరిన్ని వివరాల కోసం 9705188311 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



అంధురాలి హత్యపై తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తాడేపల్లిలో అంధురాలి హత్యపై టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలతో స్థానిక టిడిపి కార్యాలయం వద్ద, రహదారిపై నిరసన తెలిపారు. మండల అధ్యక్షులు అమర రమాదేవి మాట్లాడుతూ పకడ్బందీ భద్రత ఉండే సిఎం ఇంటికి సమీపంలో ఈ ఘాతుకం జరిగినా పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సిఎం నివాస ప్రాంతంలో రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల స్వైర విహారం రాష్ట్రంలో శాంతి భద్రతల దుస్థితికి నిదర్శనమన్నారు. నేరస్తులను ప్రోత్సహించేలా ప్రభుత్వ చర్యలున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జరీనా సుల్తానా, నజీరున్నీసా బేగం, పి.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై కేసులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ శాఖాధికారులు 33 బృందాలుగా తనిఖీలు చేపట్టారు. అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న 100 మందిని గుర్తించి రూ.5,25,600 అపరాధ రుసుం విధించడంతోపాటు విద్యుత్ చోరీ కింద మూడు కేసులు నమోదు చేసి రూ.1,14,00 పెనాల్టీ విధించినట్లు అధికారులు తెలిపారు. అదనపు లోడు వినియోగం కింద 94 కేసులకు రూ.3,91,600 పెనాల్టీ విధించామన్నారు. అనధికార విద్యుత్ కింద రెండు కేసులు నమోదు చేసి రూ.10 వేల జరిమానా, బ్యాక్ బిల్లింగ్ కింద ఒక కేసుకు రూ.10 వేల అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. రానున్న రోజుల్లో తరచూ ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. తనిఖీల్లో సిఆర్‌డిఎ సర్కిల్ ఎస్ఇ పి.విజయ్‌కుమార్ విజిలెన్స్ ఎఇ సిహెచ్.రమేష్, కెవిఎల్ఎన్.మూర్తి, డిఇ అశోక్ కుమార్, ఎఇ పి.భార్గవి పాల్గొన్నారు.



దేశ సమస్యలను పరిష్కరించని కేంద్ర బడ్జెట్

బడ్జెట్‌పై విశ్లేషణ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ఉపాధి కొరత నివారించటానికి, కొనుగోలు శక్తి పెంచటానికి కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి చర్యలూ లేవని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు విమర్శించారు. కోవిడ్ అనంతరం పేదలకు కేటాయింపులు పెంచాల్సి ఉండగా గ్రామీణ ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపే విధంగా ప్రాధమిక రంగాలకు నిధులు కుదించిందన్నారు. మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషణ సదస్సు నిర్వహించారు. ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త కార్యదర్శి వివికె.సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాది హామీ పథకానికి, వ్యవసాయ రంగానికి, ఆహార సబ్సిడీకి, ఎరువుల సబ్సిడీని గతేడాది కంటే కేటాయింపులు కుదించారన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.38వేల కోట్లు తగ్గించారన్నారు. కీలకమైన వ్యవసాయ రంగానికి ఐదు శాతం కుదించారన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అవసరమైన ఆహార సబ్సిడీని కూడా గతేడాది కేటాయించిన రూ.2.87 లక్షల కోట్ల నుండి ఈ ఏడాది రూ.1.97 లక్షల కోట్లకు తగ్గించటం పేదల భద్రతకు ప్రమాదమన్నారు. ఎరువుల సబ్సిడీ తగ్గించటంతో వ్యవసాయ సంక్షోభం మరింత పెరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి తగిన కేటాయింపులు లేవన్నారు. ఎపికి మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో విశాఖ ఉక్కు సహా పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవటీకరించే విధానాలు కొనసాగించటం దేశానికి హానికరమన్నారు. గత 30 ఏళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణపై కార్మిక వర్గం చేస్తున్న పోరాటాన్ని మరింత పెద్ద ఎత్తున చేపట్టాలని, బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగాల కంటే ప్రభుత్వ సేవా రంగానికే అధిక ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు రైల్వేలకు కేటాయించిన రూ.2.42 లక్షల కోట్లు రైల్వేల అభివృద్ధికి కాదని, ప్రైవేటీకరణ విధానాలు చేపట్టటానికేన్నారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ ప్రసంగించారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు


కేక్ కట్ చేస్తున్న ధర్మచరణ్

ఘనంగా తులసి ధర్మచరణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, సన్నిహితులు గుంటూరులో ఘనంగా నిర్వహించారు. బ్రాడీపేటలోని షిరిడీ సాయి సేవాసమితిలో చిన్నారుల సమక్షంలో అల్లు సేవా సమితి ఆధ్వర్యంలో సభ్యులు కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేటి రామకృష్ణ ధర్మచరణ్ గుణగణాలను వివరించారు. ధర్మచరణ్ సన్నిహితులు అన్నదాసు వెంకటసుబ్బారావు, డొంకేన మురళి ఆధ్వర్యంలో రెడ్డిపాలెంలోని మానవతా సేవా సమితి వయో వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బండి దుర్గ, బండారు రవీంద్ర, అల్లు సేవా సమితి సభ్యులు మార్కెట్ శివ, శ్రీను, సాయి, తోట రంగారావు, డాక్టర్ కంఠా జగదీష్, కన్నెగంటి బాలు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుషులిరువురు సమానమే

ప్రొఫెసర్ సి.హెచ్. స్వరూప రాణి

ప్రజాశక్తి - ఎఎన్‌యు


సర్టిఫికెట్ ఇస్తున్న స్వరూపరాణి

సమాజంలో స్త్రీ, పురుషులిరువురు సమానమేనని అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు ఉంటున్నారని విశ్వ విద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్. స్వరూపరాణి పేర్కొన్నారు. విశ్వవి ద్యాల యంలో రెండు రోజులు గా మహిళా అధ్యయన కేంద్రం యుజిసి సౌజన్యంతో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిని చట్టబద్ధంగా గుణపాఠం నేర్పేలా శిక్షించాలన్నారు. బాధితులకు న్యాయ స్థానాలను ఆశ్రయించకుండా రాజీ చేసి నష్టపరిహారంగా డబ్బులు ఇవ్వడం కాకుండా దోషులకు కఠిన శిక్షలు పడేలా వ్యవస్థలు పనిచేయాలని పేర్కొన్నారు. గృహ హింస సెల్ లీగల్ కౌన్సిలర్ కె. పద్మ మాట్లాడుతూ మహిళలపై గృహహింస అనేక విధాలుగా జరుగుతున్నదని, నివారణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ హింస జరగడం బాధాకరమన్నారు. హింసను నివారించాలంటే మహిళలు పురుషులు ఇద్దరు సమానం అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. డాక్టర్ కె.వి. శాంతిశ్రీ సదస్సుకు అధ్యక్షత వహించారు. అనంతరం హాజరైన ప్రతినిధులకు ముగింపు సభలో సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 154 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 136 ఎంపికయ్యారు. ఇసుజి మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ సిటీల ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలో నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులను 154 మందిని షార్ట్ చేయగా వారిలో 136 ఇంటర్వ్యూలో ఎంపికయ్యారు. వీరిలో వర్సిటీకి చెందిన 54 మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ పి సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా విసి పి రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ ఈ శ్రీనివాసరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ తేసిఫ్ అహ్మద్, హెచ్ ఆర్ మేనేజర్ ఎస్ నరేష్, కంపెనీ ప్రతినిధులు, వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్సిటీని సందర్శించిన అర్. నారాయణమూర్తి

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున యూనివర్సిటీని మంగళవారం సినీ హీరో, డైరెక్టర్ అర్.నారాయణ మూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విసి పి రాజశేఖర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. నారాయణ మూర్తిని విసి, ఇతర అధికారులు శాలువా కప్పి ఈ సందర్భంగా సత్కరించారు.


సమావేశంలో మాడ్లాతున్న యస్. యస్. చెంగయ్య

మార్చి 15న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - మంగళగిరి

భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా మహాసభ మార్చి 15వ తేదీన నిర్వహించాలని విస్తృత సమావేశం నిర్ణయించింది. సిఐటియు కార్యాలయంలో మంగళ వారం సిఐటియు అనుబంధ భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తిరువీదుల శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిఐటియు నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ పనులు లేక తీవ్ర స్థాయిలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. కోరోన పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం ఇసుక విధానం , మెటీరియల్స్ ధరలు పెరగడం వలన పనులు ఉండటం లేదన్నారు. మూడు రాజధానుల ప్రకటన తర్వాత ఎక్కడ పనులు అక్కడ నిలిచి పోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సంక్షేమ చట్టం ఉన్న దానికి సంబంధించిన నిధులు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుని కార్మికులకు మొండి చేయి చూపించిందని ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలన్నారు. మార్చి 15వ తేదీ మంగళగిరి ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ జరపాలని అందుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యదర్శి ఎస్.కె జానీ భాషా కోరారు. సమావేశంలో సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కమలాకర్, నాయకులు వి.పూర్ణయ్య, చుక్కల సత్యనారాయణ, శివారెడ్డి, ఎన్.వెంకయ్య, సురేషు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూనెగుండం చెరువు అభివృద్ధికి చర్యలు

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోట గ్రామంలో నూనె గుండం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ కన్నబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి మంగళవారం పరిశీలించారు. చెరువును అభివృద్ధి చేయడంతో పాటు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, చెరువులో బోట్ షికారు వంటి కార్యకలాపాలు నిర్వహించేందుకు సాధ్యాలను పరిశీలించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. పర్యాటకులు సందర్శించే సమయంలో వాహన పార్కింగ్, వ్యాపార కార్యకలాపాలు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి వసతులను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అమరావతిలోని అమరలింగేశ్వర స్వామి పుణ్యక్షేత్రం అభివృద్ధి, జ్ఞాన బుద్ధుని ప్రతిమ, కృష్ణానది వెంబడి పార్కు తో పాటు ఇన్ఫర్మేషన్ సెంటర్ మరియు ధ్యాన మందిరం, మ్యూజియం ఇతర ప్రాంతాలను కలుపుకుంటూ పర్యాట కపరంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు సాధ్యసాధ్యాలను బట్టి నివేదిక ఇవ్వాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పర్యాటక శాఖ హరిత రిసార్ట్స్‌లో పర్యాటక, రెవెన్యూ, పురావస్తు శాఖ, మండల పరిషత్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అమరావతి పరిధిలోని అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ (లిక్విడ్ బయో ఫెర్టిలైజర్స్ యూనిట్) జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. వీటితోపాటు దగ్గర్లో ఉన్న అమరావతి హెరిటేజ్ సెంటర్‌ను మ్యూజియాన్ని పరిశీలించారు. అక్కడ పరిస్థితులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరిస్థితులు కనుగుణంగా వీటన్నిటిని ఉన్న వనరులను ఉపయోగించుకునే అభివద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, ఆర్డీవో రాజకుమారి, మండల పరిషత్ అధికారులు మాధురి, తదితరులు పాల్గొన్నారు.

కెవి పూర్ణచంద్రరావు ఘన నివాళి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పేదల పక్షాన నిలిచేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం లో కెవి పూర్ణచంద్రరావు 11వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి వడ్డేశ్వరం పున్నయ్య అధ్యక్షతన కే.వి పూర్ణచంద్రరావు విగ్రహం వద్ద జరిగింది. ముందుగా సిపిఎం జెండాను గ్రామ మాజీ సర్పంచ్ వడ్డేశ్వరం బిక్షాలు ఆవిష్కరించారు. కె.వి పూర్ణచంద్రరావు విగ్రహానికి సిపిఎం సీనియర్ నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ పూర్ణచంద్రరావు చనిపోయేంతవరకు సిపిఎం నాయకుడిగా వడ్డేశ్వరం గ్రామంలో పని చేశారని అన్నారు. వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన, పేదలకు ఇళ్ల స్థలాల సాధన కోసం అహర్నిశలు శ్రమించాడన్నారు. పేదల సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలలో, ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారని వెంకటరెడ్డి గుర్తు చేసుకున్నారు. గ్రామంలోని భూస్వాములకు వ్యతిరేకంగా, పేదల పక్షాన నిలబడి సిపిఎంను అభివృద్ధి చేసే దాంట్లో ముఖ్యపాత్ర పోషించారని అన్నారు. పూర్ణచంద్రరావు పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ప్రజా ఉద్యమాల్లో కలసి రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.కె పాపాసాహెబ్, ఈపూరి చిన్న సోమయ్య, గుడిసె శ్రీనివాసరావు, షేక్ గన్, వడ్డేశ్వరం మరియదాసు, మరి య బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఫార్మసీ విద్యార్థులకు విసి అభినందన

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న శ్రావణి, తేజేస్, కష్ణ తేజస్వి లు జనవరి 22 నుండి 28 వరకు జపాన్ లోని టోయోమా ప్రీఫెర్చ్ గవర్నమెంట్ సకుర సైన్స్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం 2023 సదస్సు కు హాజరయ్యారు. పర్యట ముగించుకొని వర్సిటీకి తిరిగి రాగా విసి పి. రాజశేఖర్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి కరుణ, కళాశాల ప్రిన్సిపాల్ ఏ ప్రమీలా రాణి, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ కోఆర్డినేటర్ జి. చెన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు.



రోగులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న అధికారులు

టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను మండల కేంద్రమైన నాదెండ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పంపిణీ చేశారు. డాక్టర్ సాయిశ్వేత, ఎంపిడిఒ జాకీర్ హుస్సేన్ వీటిని అందించారు. టి.విజయరాజు, భూపతిరావు, కల్పన, సుమ, అనూష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్ఐకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగనన్న కాలనీల్లో సదుపాయాల కోసం ధర్నా

ప్రజాశక్తి - రొంపిచర్ల

జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల నేపథ్యంలో నిర్మాణ ఖర్చు భారీగా పెరిగిందన్నారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయించి సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఆర్ఐ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు వెంకట్, ఆర్.అంజిరెడ్డి, ఎం.మధుసూదనరావు, టి.మత్తయ్య, అచ్యుతరెడ్డి, మోహనరావు పాల్గొన్నారు.

వరికపూడిసెలపై హామీలను విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి - వినుకొండ

లక్ష ఎకరాలకు సాగునీరు, 100 గ్రామాలకు పైగా తాగునీరు అందించే వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని జనసేన జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు ప్రాంతాన్ని ఆ పార్టీ నాయకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 1996 నుండి ఈ ప్రాజెక్టు ప్రధాన పార్టీలకు నినాదంగా, ఓటు బ్యాంకుగానే మిగిలిందని అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు సిఎంలుగా ఉన్నప్పుడు శిలాఫలకాలు వేసినా నిర్మాణం మాత్రం చేపట్టలేదని విమర్శించారు. ఈ ప్రాజెక్టును నిర్మించకుంటే రాజకీయ సన్యాసం చేస్తానంటూ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల గడియార స్తంభం వద్ద గతంలో ప్రకటించారని, ఈ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ కుళాయి ద్వారా నీరివ్వకుంటే చొక్కా పట్టుకు నిలదీయాలని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మర్రిపాలెంలో చెప్పారని గుర్తు చేశారు. వరికపూడిసెల నిర్మాణంపై సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సైతం ఎన్నికలకు ముందు వినుకొండలో హామీనిచ్చారన్నారు. అయితే ఇటీవల వినుకొండ వచ్చిన ఆయన ఈ విషయాన్ని విస్మరించారని విమర్శించారు. బొల్లాపల్లి మండలంలో 1200 అడుగులు బోరువేసినా నీటి జాడ లేక ప్రజలు అల్లాడుతున్నారని, ఈ ప్రాజెక్టు కోసం తమ పార్టీ పోరాడుతుందని చెప్పారు. పరిశీలనలో జనసేన మండల అధ్యక్షులు హనుమా నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి - నరసరావుపేట

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాల, బాలికల వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలను స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని జిల్లా క్రీడా ప్రాంగణంలో ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో గతంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించిన రమణారావు, శ్యాంసుందర్, రవికాంత్‌రెడ్డి, సింగారావును ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. వాలీబాల్ క్రీడలో జాతీయస్థాయిలో మంచి పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టెప్ సీఈవో పల్లవి, ఛీఫ్ కోచ్ చావల శ్రీనివాసరావు, వాలీబాల్ చీఫ్ అబ్జర్వర్ టీవీఎస్ రంగారావు, అబ్జర్వర్ ఎంఎస్ శ్రీనివాసరావు, పుడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, జెడ్‌పిటిసి చిట్టిబాబు, ఎంపిపి మూరబోయిన శ్రీనివాసరావు, విక్టరి కళాశాల ఛైర్మన్ వి.సుబ్బారెడ్డి, ఎన్.కె ఆంజనేయులు, వైస్ ఎంపిపి, వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.



బాలుర గురుకుల భవనానికి రేపు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని రామకృష్ణాపురంలో రూ.21 కోట్లతో నిర్మించిన బాలుర గురుకుల పాఠశాల నూతన భవనాలను గురువారం ప్రారంభించనున్నట్లు గురుకుల విద్యాలయాల ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త శాంతి విశాల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభోత్సవానికి హాజరవుతారని పేర్కొన్నారు.

అధిక ధరలకు ప్రకృతి వ్యవసాయ పంటల కొనుగోలు : జెసి



సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను మార్కెట్ ధర కంటే 15 శాతం అధిక ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో ధరల కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించగా జెసి మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయ పంటల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ రైతు సాధికార సంస్థ, తిరుమల తిరుపతి దేవస్థానం ఒప్పందం కుదుర్చుకున్నాయని చెప్పారు. శనగ క్వింటాళ్ రూ.6325, కంది రూ.7590 చొప్పున ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ చిలకలూరిపేట మండలంలో శనగ పంట పండిస్తున్న 11 మంది రైతుల వద్ద 95 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్నారని, బొల్లాపల్లి, ఈపూరు, పిడుగురాళ్ల, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల్లో 112 మంది రైతులు 305 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానంలో కంది సాగు చేస్తున్నారని తెలిపారు. ఆయా పంటలు చేతికొచ్చాక పరీక్షించి పురుగు మందుల అవశేషాలు లేవని పరీక్షల ద్వారా నిర్ధారించాక కొనుగోలు చేస్తామని వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళి, డిఎస్ఒ మోహన్‌రావు, సివిల్ సప్లయిస్ డిఎం జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన కోసం సైకిల్ ర్యాలీలు



దాచేపల్లిలో

ప్రజాశక్తి - దాచేపల్లి

కేన్సర్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి అమ్యూల అన్నారు. ఈ మేరకు దాచేపల్లి నగర పంచాయతీలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. డాక్టర్ అమూల్య మాట్లాడుతూ కేన్సర్ రావాడానికి కారణాలు, లక్షణాలను వివరించారు. ఏదైనా సమస్యలున్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, కమిషనర్ శ్రీవిద్య, వైద్యారోగ్య సిబ్బంది, జెడ్‌పి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో

ప్రజాశక్తి - పెదకూరపాడు

నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ప్రదర్శన చేశారు. స్థానిక జెడ్‌పి పాఠశాల నుండి సైకిల్ ర్యాలీ కొనసాగింది. సైకిల్ తొక్కడం వల్ల కలిగే లాభాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వెలుగొండ రెడ్డి వివరించారు.

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పలు వీధుల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, రాచపుండు, గర్భాశయ కేన్సర్‌పై డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి వివరించారు. సిహెచ్ఒ నాగేశ్వరరావు వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించగా జెడ్‌పి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. వైద్యాధికారి డాక్టర్ బి. మురళీధర్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేవతిభాయి, ఎంపిహెచ్ఇఒలు ఎస్.సురేష్ కుమార్, పి.శ్రీనివాసరావు, ఎంపిహెచ్ ఎస్‌కె.అచ్యుతరామన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండలంలోని నార్నెపాడులోని హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్ వద్ద నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు.



ముప్పాళ్ల మండలం నార్నెపాడులో

కేన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతోపాటు సైక్లింగ్ వల్ల ఉపయోగాలను తెలిపారు. ర్యాలీని తహశీల్దార్ భవానీ శంకర్, ఇఒపిఆర్‌డి రూపావతి ప్రారంభించగా మండల వైద్యాధికారి డాక్టర్ పి.రమాదేవి మాట్లాడారు. కేన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులువని, దాన్ని పూర్తిగానూ జయించి ఆరోగ్యంగా జీవించొచ్చని చెప్పారు. కార్యక్రమంలో 104 డాక్టర్ సూర్య ప్రకాష్, సిహెచ్ఒ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్లు నాగమల్లేశ్వరరావు, పీటర్ డామియెన్, జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం తిరుమలేష్, అంగన్వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెంలో

రైతులు ఈ-కెవైసి నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

ః మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో రబీ కాలానికి 2022- 23 సంవత్సరంలో సాగుచేసిన పైర్లను పంట నమోదు వేలి ముద్రల ద్వారా అధికారికంగా ధ్రువీకరించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్. తిరుమలాదేవి తెలిపారు. మంగళవారం ఆరమండ్ల, కొండమూది, మన్నవ రైతు భరోసా కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈకెవైసిని రైతులందరూ తప్పనిసరిగా ఫిబ్రవరి 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. దూర ప్రాంత రైతులు వారి భూమి ఉన్న వారి రెవెన్యూ గ్రామాలలో ఉన్న ఆర్బికేలకు వెళ్లి ఈ కేవైసీ ని పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆర్‌బికే లకు రాలేని వారు డిటిపి ద్వారా ఈ కేవైసీని ఉపయోగించుకోవాలని రైతులందరికీ తెలిపారు. రైతు భరోసా కేంద్రాలకు వచ్చే రైతులు వారి ఆధార్ కార్డు ,ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్ తీసుకురావాలని తెలిపారు. ఈ కేవైసీ పూర్తి అయిన తర్వాత వారి ఫోన్‌కి రైతు పేరు పంట రకం,పొలం యొక్క విస్తీర్ణం మొదలైనవి ఫోన్ మెసేజ్ ద్వారా వివరాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి డేగల వెంకట్రామయ్య, ఆర్‌బికేల సిబ్బంది, సచివాలయం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సిహెచ్ తిరుమలాదేవి



బిఎల్‌ఒలతో సమీక్షలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని

ఓటరు అనుమతి లేకుండా ఆధార్ అనుసంధానం చేయొద్దు

ప్రజాశక్తి - మంగళగిరి

ఓటరు అనుమతి లేకుండా ఆధార్ అనుసంధానం చేయవద్దని మంగళగిరి అడిషనల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ హేమమాలిని అన్నారు. మంగళవారం ఆమె మార్కండేయ కాలనీ టిప్పర్ల బజారు సచివాలయాల్లో బిఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫారం 6బిపై ఓటరు సంతకం ఖచ్చితంగా ఉండాలని సూచించారు. ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.



దివ్యశ్రీని అభినందిస్తున్న చైర్మన్ విద్యాసాగర్

అమెజాన్ ఇంటర్న్‌షిప్‌కు వివిఐటి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల విద్యార్థిని జొన్నాదుల దివ్యశ్రీ నెలకు లక్షన్నర స్టైఫండ్‌తో ఆమెజాన్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల్లో మంగళవారం వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఆమెను అభినందించారు. ఆయన మాట్లాడుతూ అమెజాన్ సంస్థ భారతదేశంలోని మహిళా ఇంజనీర్లను ప్రోత్సహించేందుకు నిర్వహించిన 'అమెజాన్ వావ్'లో దివ్యశ్రీ అత్యంత ప్రతిభ కనబరిచిందన్నారు. అంతర్జాలంలో నిర్వహించిన నాలుగు రౌండ్ల ఎంపిక ప్రక్రియను ఎదుర్కొని ఆమె సత్తాచాటిందన్నారు. ఇంటర్న్‌షిప్ పూర్తిచేసుకున్న తరువాత భారీ వేతనం పొందే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు దివ్యశ్రీని స్ఫూర్తిగా తీసుకుని ఇంజనీరింగ్ విద్యతో మెరుగైన ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ ఎంవి రఘురామ్, అకడమిక్స్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, ఐటి విభాగాదిపతి డాక్టర్ ఆళ్ళ కళావతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పెదపాలెంలో కరెంటు నిలిపివేత

ప్రజాశక్తి- దుగ్గిరాల

మండలంలోని పెదపాలెం గ్రామం విద్యుత్ శాఖ సబ్ స్టేషన్ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు బుధవారం సబ్ స్టేషన్ మరమతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆ శాఖ సబ్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు .ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3-30 నిమిషాల వరకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. పెదపాలెం, చిన్నపాలెం, పేరుకులపూడి, వీర్లపాలెం, పెద కొండూరు, గొడవర్రు, శృగారపురం, తుమ్మపూడి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న వజ్రాల అప్పిరెడ్డి

బేస్‌బాల్ క్రీడాకారులకు సన్మానం

ప్రజాశక్తి- మేడికొండూరు.

క్రీడాకారులు చదువుతోపాటు, క్రీడల్లో కూడా రాణించాలని మందపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ స్థలదాత వజ్రాల అప్పి రెడ్డి అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత నెల జనవరి 28, 29 ,30 కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -17 బేస్ బాల్ పోటీలలో గుంటూరు జిల్లా జట్టు మొదటి స్థానం సాధించిన జట్టులో శ్రీ వజ్రాల అప్పిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 5 గురు విద్యారులు పాల్గొని మొదటి స్థానంలో నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాగే పాఠశాల నుండి రాష్ట్రస్థాయి పోటీలలో, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనాలని, భవిష్యత్తులో భారత దేశం తరపున కూడా ప్రాతినిత్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల నుండి జిల్లా జట్టులో ఐదుగురు క్రీడాకారులు ఉండటం చాలా గర్వించదగ్గ విషయమని వీరికి ఈ విధంగా శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు కడియం జయరావును అభినందించారు. క్రీడా పరికరాలు కొనుగోలు చేయుటకు పాఠశాల నిర్మాణ దాత అప్పిరెడ్డి రూ.15 వేలు, అదేవిధంగా గ్రామ పెద్దలు రమణారెడ్డి రూ.5వేలు,గోపాల కృష్ణారెడ్డి రూ.5 వేలను అందజేసారు.

సిలీండర్‌కు రూ. 35 చెల్లించాల్సిందే..!

గ్యాస్ ఎజెన్సీల డెలవరీ బాయ్స్ డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలో గ్యాస్ సిలీండర్ సరఫరా చేస్తే రూ. 35 చెల్లించాల్సిందేని గ్యాస్ ఎజెన్సీల డెలవరీ బాయ్స్ డిమాండ్ చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్ సెంటర్‌లో గల రామకృష్ణ గ్యాస్ ఏజెన్సీ నుండి పార్క్ రోడ్డు 5వ లైన్‌కు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తే రూ. 35 డెలివరీ చార్జి ఇవ్వాలని కోరగా, రూ.25 ఇచ్చినప్పటికీ మరో రూ.10 చెల్లించాల్సిందేనని అంటున్నారని ఓ వినియోగదారుడు మీడియాకు తెలిపారు. అదేమిటని విచారిస్తే నూతక్కిలో తమ గోడౌన్ ఉందని అక్కడ నుంచి సిలిండర్ రావాలంటే రూ.35 ఇవ్వాల్సిందేనని సమాధానమిచ్చినట్లు తెలిపారు. వాస్తవానికి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న సమయంలో సిలిండర్‌కు చెల్లించిన మొత్తంలోనే డెలివరీ చార్జీలు కూడా వసూలు చేస్తారు. అయితే అన్ని ఏజెన్సీల డెలివరీ బాయ్స్ డెలివరీ చార్జీల వసూళుచేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరతున్నారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో కెల్‌యు విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ చప్పిడి హనుమంతరావు,

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కడప జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో ఏపి సీనియర్ ఇంటర్ జిల్లా స్థాయి సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ ను నిర్వహించారు. ఈ క్రీడల్లో కెఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.వేహిత్, పి.సూర్యఆకాష్, ప్రణయ్‌రామ్‌లు పాల్గొని ప్రతిభ చూపారని కెఎల్‌యు క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఎల్‌యుకు చెందిన ఎస్. వేహిత్ మొదటి స్థానాన్ని, ద్వితీయ స్థానం పి.సూర్య ఆకాష్, తృతీయ స్థానాన్ని ప్రణయ్‌రామ్ లు దక్కించుకున్నారని ఆయన తెలిపారు. వరుస విజయాలను సాదించిన విద్యార్థులను విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రోవిసిడాక్టర్ ఎన్.వెంటకరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్‌లు అభినందించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: ఎంటిఎంసీ పరిధిలోని కెఎల్ విశ్వవిద్యాలయంలోని యూత్ రెడ్ క్రాస్ , హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) కామాక్షి ఐకేర్ (చెరుకుపల్లి) సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కెఎల్‌యు విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సిహెచ్ హనుమంతరావు,అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్ రమ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి సమస్యలు అందర్నీ బాధిస్తున్నాయన్నారు. విద్యార్థులు ఎక్కువగా లాప్‌టాప్, ఫోన్‌లకు అలవాటు పడటం వలన కంటి సమస్యలు గురవుతున్నారని అన్నారు. డాక్టర్ రూత్ రమ్య, వైద్యులు వాసుదేవరావులు కంటి సమస్యలు గురించి విద్యార్థులకు వివరించారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో. వైస్ ఛాన్సులర్ డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, యూనివర్సిటీ యూత్ రెడ్ క్రాస్ డాక్టర్ శివా రెడ్డి, సిఈఏ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, సురేష్, చంద్రశేఖర్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.





చిన్న బాపిరెడ్డిని సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ బృందం

తబలా విద్వాంసుడు చినబాపిరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి -తెనాలి

శకపురుషుని శతజయంతి మహోత్సవాల్లో భాగంగా స్థానిక బోస్‌రోడ్‌లోని పెమ్మసాని థియేటర్లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన సత్య హరిశ్చంద్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ తబలా విద్వాంసుడు దుండి చిన్న బాపిరెడ్డిని థియేటర్ కమిటీ వారి ఆధ్వర్యంలో పట్టణ టిడిపి నాయకులు మహమ్మద్ జిబిఉల్లా, బిట్ర రాంబాబు, మస్తాన్ షరీఫ్ జిలాని, రబ్బాని, అబ్దుల్ రవూఫ్ సత్కరించారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు,డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లిభవాని, ఎన్టీఆర్ జగన్, దేవిశెట్టిభాస్కర్, గుమ్మడిప్రసాద్ పాల్గొన్నారు



రచ్చబండలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

ప్రజాసమస్యలు తెలుకునేందుకే రచ్చబండ

ప్రజాశక్తి -తెనాలి

ప్రజాసమస్యలు తెలుసుకునేందుకే గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు.మంగళవారం ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిచేందుకూ టిడిపి చేపట్టిన రచ్చబండ కార్యక్రమం గుడివాడలో నిర్వహించారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రామంలో పర్యటించిన అనంతరం రచ్చబండలో పాల్గొని మాట్లాడారు .ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరుతూ అధికారాన్ని దక్కించుకున్న వైసిపి ప్రజలను అన్నివిధాలుగా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కావూరి చంద్రమోహన్, కేసన శంకరరావు, మాజీసర్పంచ్ మాతంగి దానియేలు తదితరులు పాల్గొన్నారు.



సోమశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు

ఉత్తమ ఏపీఎం పురస్కార గ్రహీత సోమశేఖరకు సన్మానం

ప్రజాశక్తి, పెదనందిపాడు

ఉత్తమ ఏపిఎం పురస్కార గ్రహీత తానికొండ సోమశేఖర్‌ను మంగళవారం పెదనందిపాడులోని ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమశేఖర్‌కి కాకుమాను మండల ఉత్తమ ఏపిఎంగా గుంటూరు జిల్లా గౌరవ జిల్లా కలెక్టర్ , మెజిస్ట్రేట్ ఎం వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న సందర్భంగా ఆయనను మిత్రులు, స్నేహితులు అభినందించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, మేడిద సుధాకర్, కట్టా రవికుమార్, బి. రత్నకుమార్, టి. సుబ్బారావు, పి రాజమోహన్ , ఎం. మాణిక్యరావు, కె.రవి వర్మ పాల్గొన్నారు.

సైకిల్ వ్యాయామంతో కేన్సర్ తగ్గుముఖం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రతి ఒక్కరూ సైకిల్ వ్యాయామం చేయాలని, దీని వల్ల కేన్సర్ వ్యాధి తగ్గుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు అన్నారు. ఫిబ్రవరి 14న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పెదకాకాని ప్రాధమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సైకిల్ ర్యాలీ ద్వారా మంగళవారం స్థానిక ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ అమెరికాలో 4 వేల మంది క్యాన్సర్ రోగులపై 10సంవత్సరాల సైకిల్ వ్యాయామం అధ్యయనం తరువాత వ్యాధి 46శాతం నుండి 50 తగ్గినట్లు గుర్తించారన్నారు. సైకిల్ వ్యాయామము అలవాటు వలన భారత దేశంలో కూడా క్యాన్సర్ వ్యాధి తగ్గించవచ్చు అని తెలియజేశారు. ప్రజలకు ఈ వ్యాయామం పట్ల అవగాహన, వ్యాయామం వలన ఆరోగ్య లాభాలపై అవగాహన, చైతన్య కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, ఏ. జయప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ లక్ష్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డిఎంఅండ్‌హెచ్ డాక్టర్ శ్రావణ్‌బాబు, తదితరులు

జీవన సమస్యలు.. పిల్లల పరిష్కారాలు..

జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం - ఆకట్టుకుంటున్న నమూనాలు

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థాయిన అరండల పేటలోని సెయింట్ ఇగ్నీషియస్ స్కూల్లో రెండ్రోజులపాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది.జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో ఎంపికైన 85 ప్రాజెక్టులను విద్యార్థులకు జిల్లా స్థాయి ప్రదర్శనలో ఉంచారు.ప్రజలు రోజువారీ చేసే పనుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కంచటానికి విద్యార్థులు చేసిన ప్రయత్నం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు, పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు చూపిస్తూ నమూనాలు తయారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, విద్యాశాఖ అధికారులు హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెచ్చిన నమూనాలను పరిశీలించి, వాటి పనితీరు గురించి వివరాలు అడిగి తెలుసుకొని, ప్రోత్సహించారు. పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్.సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుండే సైన్స్ ధృక్పదాన్ని అలవర్చుకోవాలని, సైన్సే సమాజాభివృద్ధికి చోదకశక్తి అని పేర్కొన్నారు.మూఢనమ్మకాలు విడనాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, సమగ్ర శిక్ష ఏపిసి జి.విజయలక్ష్మి, ఉప విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఆర్.శివనాగేశ్వరరావు, ఎంఇఒ ఖుద్దూస్, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

రైతుల కోసం మల్టీపర్పస్ మిషన్



రైతులు వ్యవసాయంలో వివిధ దశల్లో వ్యవసాయ పరికరాలు వినియోగిస్తారు. విత్తనాల నుండి కోత కోసే వరకూ పరికాలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో దున్నటానికి, విత్తనాలకు, ఎరువులు, పురుగుమందులు చల్లటానికి, లెవల్ చేయటానికి ఇలా అన్ని రకాల పనులకూ ఒకే రకమైన యంత్రాన్ని ఉపయోగించుకుంటే సమయం, ధనం ఆదా అవుతుందంటూ ముట్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్.నాగూర్‌బి నమూనా రూపొందించి ప్రదర్శనలో ఉంచింది.



పిల్లల కోసం ఆధునిక ఊయల

ఆధునిక ప్రపంచంలో తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయటం తప్పనిసరి అయన నేపథ్యంలో పిల్లల ఆలన పాలన చూసుకోవటానికి టెక్నాలజీ సాయంతో వివిధ రకాల ఊయలు రూపొందిస్తూ ముట్లూరూ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.రిషిత స్మార్ట్ బేబీ ఫ్రెండ్లీ క్రాడిల్ నమూనాను తయారు చేసిం ది. ఈ ఊయాలలో ఉన్న పిల్లలు ఏడ్చినా, ఏదైనా ఇబ్బంది పడినా వెంటనే అలారం మోగుతుంది. తల్లిదండ్రులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవటానికి సహాయం చేస్తుంది.



రోడ్డు ప్రమాదాల నివారణకు అలారం

రోడ్డు ప్రమాదాల నివారణకు ఆత్మకూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వి.శ్రీహరి, కె.వెంకట నాగహేమసాయి యాక్సిడెంట్ డిటెక్టర్‌ను రూపొందించారు. దీన్ని కారులో ఏర్పాటు చేసుకుంటే వాహనం నడిపేటప్పుడు డ్రైవర్‌కు నిద్ర వచ్చినా హెచ్చరిస్తుంది. వేరొక వాహనం ఢీకొన్నా, వెనక నుండి వచ్చే వాహనాలు అతి దగ్గరగా వచ్చినా కార్‌కు ఏర్పాటు చేసిన సెన్సార్‌లు గుర్తించి, దగ్గర్లోని పోలీసు స్టేషన్, హాస్పిటల్‌కు, హైవే సెక్యూరిటీ వారికి సమాచారం ఇస్తుంది.

వర్షం నుండి పంటకు రక్షణ



రైతులు వారి వ్యవసాయ ఉత్పత్తుల్ని ఆరబెట్టుకోవటంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాలకు పంటలు తడిచి రేటు తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో పెదపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు టి.రేమాస్, జి.అనిల్‌కుమార్ రైతుల కోసం రెయిన్ డిటెక్టర్ అండ్ ప్రొటెక్టర్ నమూనాను ప్రదర్శించారు. దీని ద్వారా వర్షం వచ్చినప్పుడు రైతుల్ని హెచ్చరిస్తుంది. పంటపై మోటార్ల సాయంతో ఏర్పాటు చేసిన పరదా దానంతట అదే కప్పే విధంగా, వర్షం తగ్గాక వెనక్కి వెళ్లే విధంగా సరికొత్త నమూనాను రూపొందించారు.


పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న డి శివకుమారి



గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎల ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలో నాయకుల డిమాండ్ - నరసరావుపేటలో భారీ ర్యాలీ - జెసిలకు వినతి

గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గుంటూరు, పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్‌ల వద్ద విఆర్‌ఎలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఇంత వరకూ వీఆర్‌ఏల ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయకపోవడం అన్యాయమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ అన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీఆర్‌ఏలకు ఒక్క రూపాయి జీతం పెంచకపోగా గత 30 ఏళ్లుగా ప్రతి ఆరు నెలలకు ఓసారి ఇస్తున్న డిఏను కూడా ఇవ్వలేదని అన్నారు. వీఆర్‌ఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత ధోరణికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో చెల్లించిన డిఏని కూడా తిరిగి రికవరీ చేయడం మరింత విషాదాన్ని కలిగిస్తున్నదని అన్నారు. వందలాదిమంది నామినీ వీఆర్‌ఏలుగా సంవత్సరాల తరబడి పనిచేస్తున్నా, వారిని రెగ్యులర్ వీఆర్‌ఏలుగా నియమించట్లేదన్నారు. వీరికి న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన వాచ్‌మెన్, అటెండర్, విఆర్‌ఓ ప్రమోషన్లను కూడా ఏళ్ల తరబడి ఇవ్వలేదన్నారు. విఆర్‌ఎల సమస్యలపై అనేకసార్లు అధికారులు, మంత్రులు, ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తులు చేసినా వారి నుండి ఎలాంటి స్పందన లేదని, గత్యంతరం లేని పరిస్థితుల్లో వీఆర్‌ఏలు పోరాటానికి దిగాల్సి వచ్చిందన్నారు. ఇదే విధంగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే రానున్న కాలంలో వీఆర్‌ఏలు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమానికి పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాజీ బాబు మాట్లాడుతూ విఆర్‌ఎలకు విఆర్‌ఎలకు కనీస వేతనాలు అడుగుతుంటే పార్ట్‌టైమ్ ఉద్యోగులు అంటున్న ప్రభుత్వం పని విషయంలో మాత్రం వెట్టిచాకిరీ చేయించుకుంటుందన్నారు. ఇది చాలదన్నట్లు ఫేస్ రికగ్నిజేషన్ అటెండెన్స్ వేయాలని చెప్పటం అన్యాయమన్నారు. విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జిల్లా నాయకులు కురగంటి సంగయ్య, షేక్ మస్తాన్ వలి, రాజేష్ పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

నరసరావుపేట: విఆర్‌ఎల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ సేవకులు సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గాంధీ పార్క్ నుండి సుమారు 400 మంది గ్రామ సేవకులు ర్యాలీగా బయలుదేరి వారి సమస్యలు పరిష్కరించాలంటూ నినదిస్తూ ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయం వద్ద చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సేవకుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహేబ్ మాట్లాడుతూ వీఆర్‌ఏలకు 26,000 వేతనం పెంచి పేస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలు మాత్రమే వర్తించేలా ఉన్న జీవోను సవరించి పూర్తి డిఏ కొనసాగించ న్యాయం చేయాలని కోరారు. కరోనా సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే వీఆర్‌ఏల వేతనం రూ.2000 కోత విధించారని తిరిగి ఇప్పటికి చెల్లించలేదని వెంటనే జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ కలిసి వినతి పత్రం అందజేశారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని జెసి తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి జి రవిబాబు, జి. మల్లేశ్వరి, జిల్లా అధ్యక్షులు కే హనుమంత రెడ్డి, కోశాధికారి డి శివకుమారి, పట్టణ కార్యదర్శి వి. మస్తాన్ రెడ్డి, గ్రామ సేవకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.


జెసికి వినతి పత్రం ఇస్తున్న విఆర్‌ఎ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు బాజీ బాబు, నాయకులు నేతాజీ తదితరులు


పల్నాడు జిల్లా జెసికి వినతి పత్రం ఇస్తున్న సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహేబ్ తదితరులు